Andhra jyothy Dt 13/11/17.



మెట్రో హబ్‌గా అమీర్‌పేట

- ఇప్పటి వరకు ఐటీ.. ఇక నుంచి మెట్రో
- ఆంధ్రా ట్రావెల్స్ బస్సులకు ఇదే కేంద్రం
- 24 గంటలూ రవాణా సదుపాయం

మొదటి దశలో మెట్రో రవాణా	
అమీర్‌పేట-మియాపూర్	13 కి.మీ
అమీర్‌పేట- రాయదుర్గం	11 కి.మీ
అమీర్‌పేట-ఎల్‌బీనగర్	16 కి.మీ
అమీర్‌పేట - నాగోల్	17 కి.మీ
భవిష్యత్‌లో అమీర్‌పేట మీదుగా మెట్రో పొడిగించే మార్గాలు	
అమీర్‌పేట-పటాన్ చెరు	23 కి.మీ
అమీర్‌పేట- హయత్‌నగర్	22 కి.మీ
అమీర్‌పేట-గచ్చిబౌలి-శంషాబాద్ ఎయిర్‌పోర్టు	23 కి.మీ
అమీర్‌పేట-ఫలక్‌నుమా-శంషాబాద్ ఎయిర్‌పోర్టు	27 కి.మీ
అమీర్‌పేట-ఈసీఐఎల్	17 కి.మీ

హైదరాబాద్ సిటీ, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఐటీతో అమీర్‌పేట పేరు అమెరికా దాకా మార్మోగింది. తాజాగా మెట్రో రైలు రాకతో ఆ పేరు అంతర్జాతీయ ఖ్యాతిని పొందనుంది. అత్యాధునిక ప్రజా రవాణా సాధనంగా దూసుకువస్తున్న మెట్రో రైలు అటు ఆర్టీసీ, ఇటు రైల్వే స్టేషన్లన్నింటిని అనుసంధానం చేస్తూ నగర శివార్లకు విస్తరించింది. దీంతో నగర మూలలకు వెళ్లాలన్నా అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ మెట్రో స్టేషన్ కీలకంగా మారింది. ప్రస్తుతం మొదటి దశలో ఉన్న 72 కి.మీ మేర మూడు కారిడార్‌లకు అనుసంధానం ఉండగా, భవిష్యత్‌లో వచ్చే రెండోదశ మెట్రోకు అమీర్‌పేట అత్యంత కీలకమైన ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌గా మారనుంది. మొత్తంగా అమీర్‌పేట ప్రాంతం మెట్రో హబ్‌గా మారనుంది.

ఆ స్టేషన్ నుంచి 4 గమ్యస్థానాలకు..

అమీర్‌పేట నుంచి నగరం నలువైపులా వెళ్లేందుకు అవకాశం ఉంది. అమీర్‌పేట మీదుగా కొత్తగా వస్తున్న మెట్రో రైలు కారిడార్ మొత్తం ప్రాజెక్టులోనే ప్రత్యేకతను కలిగి ఉంది. భవిష్యత్‌ను ఊహించే అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌ను ఎంతో విశాలంగా వేలాది మంది ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేలా నిర్మాణాలు చేపట్టారు. నడిరోడ్డుపై మూడు అంతస్తుల్లో నిర్మించిన ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ నుంచి 4 వైపులా వెళ్లేందుకు మెట్రో మార్గాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ నెల 28 నుంచి అమీర్‌పేట-మియాపూర్ 13 కి.మీ, అమీర్‌పేట-నాగోల్ 17 కి.మీ సిద్ధమవుతుండగా, మరో నాలుగు నెలల్లో అమీర్‌పేట-ఎల్‌బీనగర్, అమీర్‌పేట-హైటెక్ సిటీ ప్రాంతాలకు మెట్రో రైలు పరుగులు పెట్టనుంది. నాలుగు వైపులా వెళ్లే మార్గాలన్నీ నగరంలోనే అత్యంత రద్దీ ఉన్న ప్రాంతాలు.

బస్, రైల్వే స్టేషన్లతో అనుసంధానం..

అమీర్‌పేట మీదుగా ఉన్న మెట్రో కారిడార్‌లు ప్రజా రవాణాలో కీలకమైన ఆర్టీసీ, రైల్వే స్టేషన్, ఎంఎంటీఎస్‌లకు అనుసంధానం కానున్నాయి. ఇందులో ప్రధానంగా దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు నాంపల్లి రైల్వే స్టేషన్‌ను, మహాత్మాగాంధీ బస్ స్టేషన్(ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్(జేబీఎస్)లను కలుపుతోంది. వీటికి తోడు నగర ప్రజా రవాణాలో విజయవంతంగా నడుస్తున్న ఎంఎంటీఎస్ స్టేషన్లతోనూ అనుసంధానం ఏర్పడుతోంది. వీటిలో భరత్‌నగర్, లక్డీకాపూల్, బేగంపేట, మలక్‌పేట ఎంఎంటీఎస్ స్టేషన్లు ఉన్నాయి. ఇలా ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రధాన ప్రజా రవాణా వ్యవస్థలతో మెట్రో అనుసంధానం కావడంతో అమీర్‌పేట నుంచి ఎక్కడికి వెళ్లేందుకైనా అవకాశం ఉండడం దీని ప్రత్యేకత.

వేల సంఖ్యలో విద్యార్థులు..

అమీర్‌పేటలో ఉన్న ఐటీ శిక్షణా సంస్థలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని అన్ని నగరాల నుంచి వస్తున్నారు. వీరంతా అమీర్‌పేట చుట్టు పక్కల ఉన్న కాలనీలు, బస్తీల్లో వేల సంఖ్యలో వెలిసిన ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఇక్కడి నుంచే నగరంతో పాటు బెంగుళూరు, చెన్నై, పూణే వంటి నగరాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు.

మెట్రో కారిడార్ మరింత విస్తరణ..

ప్రయాణికులే ప్రజా రవాణాకు కీలకం. అమీర్‌పేట కేంద్రంగా ప్రయాణాలు చేసేవారు లక్షల్లో ఉన్నారు. నిత్యం ఇక్కడి నుంచి ఉద్యోగ, వ్యాపార నిమిత్తం నగరంతో పాటు దేశ, విదేశాలకు వెళ్లే వారు ఉన్నారు. దీంతో మెట్రో మొదటి దశకు తోడు రెండో దశను నగర నలువైపులా విస్తరించాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఇప్పటి వరకు అమీర్‌పేట నుంచి 17, 13, 11, 16 కి.మీకు పరిమితమైన మెట్రో సౌకర్యం భవిష్యత్‌లో 35 నుంచి 40 కి.మీ దూరం వరకు విస్తరించే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ రెండోదశపై దృష్టి సారించింది.

ఐటీ అధ్యాయం ఇక్కడి నుంచే..

ఐటీ రంగం ఇక్కడి నుంచే మొదలైంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) అమీర్‌పేటలోని హుడా మైత్రీవనంలోనే ఏర్పాటైంది. ఇక్కడి నుంచి హైదరాబాద్‌లో ఐటీ రంగం విస్తరించేందుకు తొలి అడుగులు పడ్డాయి. 1990 దశకం నుంచి అమీర్‌పేటలో ఐటీ కోర్సుల శిక్షణా సంస్థలు, చిన్న స్థాయి కంపెనీలు ఏర్పాటయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐటీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దేశ, విదేశాలకు చెందిన వారు సైతం ఇక్కడ శిక్షణ తీసుకున్నారు.

తెలుగు చిత్ర పరిశ్రమ ప్రస్థానం..

చెన్నై కేంద్రంగా ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమ ప్రస్థానం అమీర్‌పేట నుంచే ప్రారంభమైంది. ఇక్కడ సుమారు 11 ఎకరాల సువిశాలమైన స్థలంలో సినీ స్టూడియోలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్‌లో అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలు ఏర్పాటయ్యాయి. చిత్ర పరిశ్రమకు చెందిన వారంతా ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లోనే నివాసం ఉంటున్నారు. ఇప్పటికే ఎన్నో విజయవంతమైన సినిమాల షూటింగ్‌లు సారథి స్టూడియోలో జరిగాయి. టెలివిజన్ రంగం విస్తరించడంతో స్టూడియోలోని ఫ్లోర్‌లన్నీ నిత్యం షూటింగ్‌లతో బిజీగా ఉంటున్నాయి.

మెట్రోకు ఇంధనం విద్యుత్..!

ప్రత్యేకంగా 4 సబ్‌స్టేషన్లు
నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో సప్లై ప్రారంభం
మెట్రోకు 90-125 మెగావాట్లు అవసరమంటున్న విద్యుత్ శాఖ

హైదరాబాద్ సిటీ, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు మరికొన్ని రోజుల్లో పరుగులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో మెట్రోకు ఇంధనమైన విద్యుత్ సరఫరాపై విద్యుత్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మెట్రో రైలు నడిచేందుకు, మెట్రోస్టేషన్లు, వ్యాపారసముదాయాలకు ప్రారంభంలో 60 మెగావాట్ల వరకు విద్యుత్ అవసరముంటుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మెట్రోకు పూర్తిస్థాయిలో అవసరమైన 90-125 మెగావాట్ల విద్యుత్ కోసం ఉప్పల్, మియాపూర్, ఇమ్లిబన్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో 220/132కేవీ నాలుగు విద్యుత్ ఉపకేంద్రాలు నిర్మించారు. ఇప్పటికే కొంతకాలంగా నాగోల్, మియాపూర్ సబ్‌స్టేషన్లకు విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరా చేస్తోంది. మరో రెండు స్టేషన్లకు ఎప్పుడు విద్యుత్ సరఫరా చేయమన్నా వెంటనే చేస్తామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. అంతరాయాలు తలెత్తకుండా ఉండేలా విద్యుత్ సరఫరా కోసం ప్రత్యామ్నాయ లైన్లు ట్రాన్స్‌కో నుంచి తీసుకున్నారు. ఒక ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తినా మరో కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. నాలుగు ఉపకేంద్రాలకు విద్యుత్ సరఫరా కోసం నాలుగు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. లైన్ల నుంచి సబ్‌స్టేషన్లకు ట్యాప్ ఇచ్చిన ఉపకేంద్రాల్లో పవర్‌మీటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. లైన్ల నుంచి మెట్రో స్టేషన్లకు సరఫరా జరిగి వినియోగిస్తున్న విద్యుత్ పవర్‌మీటర్లలో ఆటోమేటిక్ రికార్డ్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. నాలుగు ఉపకేంద్రాల్లో విద్యుత్ శాఖ టెక్నికల్ అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

మియాపూర్, నాగోల్‌కు 60 మెగావాట్లు..

మెట్రో రైల్ ప్రారంభ మార్గమైన మియాపూర్ నుంచి అమీర్‌పేట-నాగోల్ వరకు 30 కిలోమీటర్ల దూరం తొలిదశలో మెట్రో రైల్ నడిపేందుకు 60 మెగావాట్ల వరకు విద్యుత్ అవసరమవుతుందని విద్యుత్ శాఖ, మెట్రో వర్గాలు అంచనా వేస్తున్నాయి. మెట్రో ట్రయల్ రైల్ నడిపేందుకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా చేస్తోంది. మెట్రోకు ఏ స్థాయి లో విద్యుత్ సరఫరా అయినా నిరంతరం అందించేలా ప్రత్యేక లైన్లు, సబ్‌స్టేషన్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడు కారిడార్లలో 72 కి.మీ మార్గంలో మెట్రోకు అవసరమైన 125 మెగావాట్లకు అవసరమైన కొత్త లైన్లు, సబ్‌స్టేషన్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మెట్రో రైళ్లలో ఎలక్ట్రో డైనమిక్ బ్రేకింగ్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. బ్రేక్ వేయడం వల్ల తిరిగి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను లైన్లకు అనుసంధానం చేసి వినియోగించుకోనున్నారు. ఈ కారణంగా 30-40 శాతం విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్ శాఖ నిపుణులు, ఇంజనీర్లు చెబుతున్నారు.

ఒక్క యూనిట్‌కు రూ.3.95

మెట్రో రైళ్లు పూర్తిగా విద్యుత్‌తో నడవనున్నాయి. ఒక్క యూనిట్‌కు రూ.3.95 చార్జీ వసూలు చేయనున్నారు. మెట్రోస్టేషన్ డిపోలు, మాల్స్‌కు సంబంధించి వాణిజ్య అవసరాలకు హెచ్ టూ కేటగిరిలో ఒక్కో యూనిట్‌కు రూ.10 చార్జీ వసూలు చేయనున్నారు. మొత్తంగా మెట్రో రైళ్లు నడిచేందుకు స్టేషన్లు, డిపోలతో ఆపరేషన్ కంట్రోల్ రూంకు సంబంధించి ప్రతి రోజూ 7.63లక్షల యూనిట్లు అవసరం పడుతుందని గతంలో అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన కేవలం మెట్రోరైల్ నడిచేందుకు నెలకు 228.9 లక్షల యూనిట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ మార్గంలో ఒక్క మెట్రో ట్రిప్‌కు గంటకు 450 కిలోవాట్ల విద్యుత్ అవసరముంటుందని గతంలో హెచ్ఎంఆర్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చే 30 కిలోమీటర్ల మెట్రోరైల్ మార్గానికి మెట్రో ప్రారంభం తరువాత విద్యుత్ వినియోగం కచ్చితంగా తెలుసుకునే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

మెట్రోకు అవసరమైన విద్యుత్ అంచనాల ప్రకారం వార్షిక వినియోగం (కిలోవాట్స్ గంటలు)	
2017-18	1897
2018-19	1982
2019-20	1982

ఎంజీబీఎస్ మెట్రో సబ్‌స్టేషన్ ఉప్పల్ మెట్రో సబ్‌స్టేషన్